క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

తంగళ్లపల్లి: మండలంలోని 33 కేవీ లైన్ మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 9గంటలనుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు తంగళ్లపల్లి, మండెపల్లి, తాడూర్, గోపాలరావుపల్లి, పాపయ్యపల్లి, లక్ష్మీపూర్, అంకుషాపూర్, పద్మనగర్, సారంపల్లి, బద్దెనపల్లి, ఇందిరమ్మ కాలనీ, టెక్స్‌టైల్ పార్కు గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని సెస్ ఏఈ మధుకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకు విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

రజతోత్సవ సన్నాహక సమావేశంలో ఆగయ్య



వేదికపై కేసీఆర్, కేటీఆర్‌తో తోట ఆగయ్య

ఎల్లారెడ్డిపేట: బీఆర్ఎస్ రజతోత్సవ మహాసభ నిర్వహణ నేపథ్యంలో ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాల ముఖ్య నేతలతో గురువారం మాజీ సీఎం కేసీఆర్ సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌లతో సమాశానికి పార్టీ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య హాజరయ్యారు.

చంద్రప్రభ వాహనం అందజేత



గంభీరావుపేట: మండలకేంద్రంలోని శ్రీ సీతారామస్వామి దేవస్థానానికి భక్తులు సాయబుగారి రేణుక-నాంపల్లిగౌడ్ రూ.లక్షా 21వేలతో చంద్రప్రభ వాహనం అందించారు. బ్రహ్మోత్సవాల సమయంలో చంద్రప్రభ వాహనం లేకపోవడంతో స్వామివారిని గజవాహనంపై ఊరేగించాల్సి వస్తోంది. వాహనాన్ని సమకూర్చిన భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

సీతారాముల శోభాయాత్ర



కోనరావుపేట: మండలంలోని మామిడిపల్లిలో శ్రీరామ దీక్షాపరుల ఆధ్వర్యంలో సీతారాముల శోభాయాత్ర నిర్వహించారు. స్వామివారి ఉత్సవ మూర్తులను ప్రతిష్ఠించి గ్రామంలో నగర సంకీర్తన చేసుకుంటూ తరలివెళ్లారు. మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికి మొక్కులు చెల్లించుకున్నారు.

కుంకుమ పూజలు



కుంకుమ పూజల్లో మహిళలు

ఎల్లారెడ్డిపేట: మండలంలోని రాచర్ల గొల్లపల్లి శ్రీ వేణుగోపాలస్వామి ఆలయంలో మహిళలు గురువారం కుంకుమపూజలు నిర్వహించారు. ఆలయ వార్షికోత్సవ వేడుకల సందర్భంగా నిర్వహిస్తున్న ఉత్సవాల్లో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొంటున్నారు. శుక్రవారం రుక్మిణీ సత్యభామ సహిత కల్యాణ ఉత్సవాలకు ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కమిటీ తెలిపింది.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

తంగళ్లపల్లి: రేషన్ దుకాణాల ద్వారా నిరుపేదలకు సన్నబియ్యం అందిస్తుండడాన్ని హర్షిస్తూ గురువారం సారంపల్లి గ్రామస్తులు సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కేకే.మహేందర్ రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. యూత్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు మునిగెల రాజు, ఏఎంసీ డైరెక్టర్ గుగ్గిళ్ల రాములు, మానవ హక్కుల యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు గుగ్గిళ్ల భరత్ గౌడ్, ఎండీ.హనీఫ్, గడ్డమీద శ్రీనివాస్, గుండి పరుశరాం, కోల గంగారం, గుగ్గిళ్ల ఆంజనేయులు, ఆనందం, వినోద్, శరత్, గ్రామ మహిళలు పాల్గొన్నారు.

పాదయాత్రలకు సిద్ధం కావాలి

ఎల్లారెడ్డిపేట: కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాదయాత్రలకు సిద్ధం కావాలని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య అన్నారు. పార్టీ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజలకు వివరించేందుకు సిద్ధంగా ఉండలన్నారు. పాదయాత్రలో భాగంగా గ్రామాల్లో పార్టీ జెండా ఎగురవేయాలని, అంబేడ్కర్, గాంధీ విగ్రహాలకు పూలమాలలు వేయాలన్నారు. సమావేశంలో నాయకులు రాంరెడ్డి, బాలయ్య, శ్రీనివాస్, తిరుపతిరెడ్డి, రవీందర్, బుచ్చాగౌడ్, మల్లారెడ్డి, లక్ష్మణ్, రవి తదితరులు పాల్గొన్నారు.

సొంతింటిపై ఆశలు!

- చివరి దశలో డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణ పనులు
- అద్దె ఇళ్లలో ఇబ్బంది పడుతున్న ప్రజలు
- కొండాపూర్, గూడెంలో నిర్మాణాలు
- పనులు పూర్తిచేసి వెంటనే పంపిణీ చేయాలని విజ్ఞప్తి



ఈ చిత్రంలో కనిపిస్తున్న యువతి పేరు గద్దల సుజాత. ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేసే భర్త దుర్గాప్రసాద్ రెండేళ్ల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. అప్పటి నుంచి ఇద్దరు పిల్లలు యశ్వంత్, యశస్వినితో అద్దె ఇంట్లో నివసిస్తోంది. కూలీ పనులు చేస్తూ ఇద్దరు పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చదివిస్తోంది. భర్త మృతి చెందకముందే అధికారులు, గ్రామ పెద్ద మనుషులు సుజాత పేరిట డబుల్‌బెడ్‌రూం ఇంటిని మంజూరు చేశారు. నాలుగేళ్లైనా గూడెంలో డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణం పూర్తికాకపోవడంతో, నెలకు రూ.1500 అద్దె చెల్లిస్తూ కుటుంబాన్ని పోషిస్తోంది.



గూడెంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు

ముస్తాబాద్: పేదల సొంతింటి కలగానే మిగిలిపోతుంది. పాలకులు మారినా తమకు గూడు దక్కడం లేదని వాపోతున్నారు. ఏళ్లుగా సాగుతున్న నిర్మాణాలతో అద్దె ఇళ్లలో ఇబ్బందులు పడుతున్నారు. ముస్తాబాద్ మండలంలో గూడెం, కొండాపూర్ గ్రామాల్లో గత ప్రభుత్వం చేపట్టిన డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణం కొలిక్కి రావడం లేదు. ఏడాదిగా నిర్మాణ పనులు చివరి దశలోనే సాగుతున్నాయి.

400కు పైగా దరఖాస్తులు

గూడెంలో డబుల్ బెడ్‌రూం ఇళ్లకోసం 400కు పైగా దరఖాస్తులు వచ్చాయి. ఇందులో నిజమైన పేదలను గుర్తించారు. మరోవైపు రోడ్డు విస్తరణ పనుల్లో ఇళ్లు కోల్పోయిన బాధితులకు సైతం డబుల్‌బెడ్‌రూం ఇళ్ల కోసం హామీలు ఇచ్చారు. తొలుత స్థలం లభించకపోవడంతో ఏడాది ఆలస్యమైంది. దీంతో గుట్టకింద స్థలాన్ని చదునుచేసి పనులు మొదలు పెట్టారు. ఇక్కడ ఆరు బ్లాకుల్లో 48 ఇళ్లు నిర్మించారు. ఒక్కో బ్లాకులో 8 కుటుంబాలను కేటాయించారు. ఏడాదిగా ఎలక్ట్రీషియన్ పనులు, కిటీకీలకు అద్దాల పనులు నడుస్తున్నాయి. ఈ పనులు పూర్తయితే 48 కుటుంబాల్లో వెలుగులు నిండనున్నాయి. కొండాపూర్‌లోనూ అవే సమస్యలున్నాయి. ఇక్కడ ఆరు బ్లాకుల్లో చేపట్టిన పనులు చివరిదశలో ఉండగా, రెండేళ్లుగా పూర్తికావడం లేదు. అర్హులను ఎంపికచేసి ఏళ్లు గడుస్తున్నా పేదలు అద్దె ఇళ్లు, గుడిసెల్లోనే ఉండాల్సి వస్తోంది.

అద్దె ఇంట్లో ఉంటున్నాం



ఏళ్లుగా అద్దె ఇంట్లో ఉంటున్నాం. నాకు ముగ్గురు అమ్మాయిలు. వారి వివాహాల కోసం అప్పులు చేశాం. కొడుకును దుబాయ్‌కు పంపించాం. నాభార్య సరళ బీడీలు చేస్తుంది. డబుల్ బెడ్ మంజూరు చేసిన్రు. కానీ ఇప్పటి వరకు ఇవ్వలేదు. ఏమైనా అడిగితే పనులు పూర్తి కాలేదంటున్నారు. – రుద్రోజు రవి, గూడెం

పేదలకు గూడు కల్పించాలి



గూడెంలో ఎంతోమంది గుడిసెల్లో, అద్దె ఇళ్లలో ఉంటున్నరు. 48 ఇళ్లు ఐదేళ్లుగా నిర్మిస్తున్నారు. అవి ఎప్పటికీ పూర్తి చేస్తారో తెలియదు. పనులు చివరి దశలో ఉన్నయి అంటున్నరు. వెంటనే పూర్తిచేస్తే పేదలకు, ఇళ్లు కోల్పోయిన బాధితులకు ఇవ్వచ్చు. కలెక్టర్ చర్యలు తీసుకోవాలి. – కోల అక్షయ్, గూడెం

అర్హులకు త్వరలోనే అందిస్తాం



కొండాపూర్, గూడెం గ్రామాల్లో డబుల్ బెడ్‌రూం ఇళ్ల పనులు చివరి దశలో ఉన్నాయి. కాంట్రాక్టర్లకు పనులు త్వరగా చేయాలని సూచించాం. త్వరలోనే పనులు పూర్తిచేసి, అర్హులైన వారికి అందిస్తాం. ఇంజినీరింగ్ అధికారులను సమన్వయం చేసుకొని పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటాం. – సురేశ్, తహసీల్దార్, ముస్తాబాద్

సన్నబియ్యం పంపిణీ చారిత్రాత్మకం



తంగళ్లపల్లి: బద్దెనపల్లిలో సన్నబియ్యం పంపిణీ ప్రారంభిస్తున్న వెలుముల స్వరూప



రుద్రంగిలో బియ్యం పంపిణీ ప్రారంభిస్తున్న నాయకులు



ఎల్లారెడ్డిపేట: రాచర్లబొప్పాపూర్‌లో సన్నబియ్యం పంపిణీ చేస్తున్న నాయకులు

తంగళ్లపల్లి: నిరుపేదలకు రేషన్‌షాపుల ద్వారా సన్నబియ్యం పంపిణీ చేయడం చారిత్రాత్మక నిర్ణయమని సిరిసిల్ల ఏఎంసీ చైర్‌పర్సన్ వెలుముల స్వరూప తిరుపతి రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని బద్దెనపల్లి రేషన్ షాపులో సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. అనంతరం గ్రామానికి చెందిన వానరాసి శైలజకు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా మంజూరైన రూ.58,500 చెక్కును అందజేశారు. కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ నేరెళ్ల నర్సింగం గౌడ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రవీణ్ జే టోని, ఉపాధ్యక్షుడు గుగ్గిళ్ల శ్రీకాంత్ గౌడ్, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు చుక్క రాజశేఖర్, నాయకులు ఎల్లయ్య, మల్లేష్ బాబు, సూర్యరావు, ఎల్లయ్య, రేషన్ డీలర్ ప్రసూన, గ్రామస్తులు పాల్గొన్నారు.

వేములవాడరూరల్: వేములవాడ రూరల్ మండలంలోని అన్ని గ్రామాల్లో సన్నబియ్యాన్ని పంపిణీ చేశారు. ప్రభుత్వం హామీ మేరకు పథకాలను అమలుచేస్తుందని కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కన్వీనర్ చిలుక ప్రభాకర్ అన్నారు. హన్మాజిపేటలో బియ్యం పథకాన్ని ఆయన ప్రారంభించి లబ్ధిదారులకు అందజేశారు. మార్కెట్ కమిటీ డైరెక్టర్ మ్యాక స్రవంతి, హరినందన్ రెడ్డి, గ్రామ డీలర్ రాజ్యలక్ష్మి, శ్రీనివాస్, యూత్ కాంగ్రెస్ నాయకులు కొమ్ము మహేందర్, మర్రిపల్లి మల్లేశం, పసుల లక్ష్మీ రాజం, విక్కుర్తి ఎల్లయ్య, కార్యకర్తలు పాల్గొన్నారు.

గంభీరావుపేట: సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని గోరింటాలలో ప్రారంభించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్‌పర్సన్ కొమిరిశెట్టి విజయ, తహసీల్దార్ మారుతిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు తిరుపతి, జిల్లా ప్రధాన కార్యదర్శి రాంచంద్రారెడ్డి, సింగిల్‌విండో డైరెక్టర్ అంజిరెడ్డి పాల్గొన్నారు.

కోనరావుపేట: మండలంలోని మరిమడ్ల, మంగళ్లపల్లి, సుద్దాల, నిమ్మపల్లి, మామిడిపల్లిలో సన్నబియ్యం పంపిణీని కిసాన్‌సెల్ జిల్లా అధ్యక్షుడు కేతిరెడ్డి జగన్మోహన్‌రెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు షేక్ ఫిరోజ్‌పాషా ప్రారంభించారు. సన్నబియ్యాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎంపీవో ఆరిఫ్ పాషా, ఏఎంసీ చైర్మన్ ఎల్లయ్య, నాయకులు బాలరాజు, ప్రభాకర్, మల్లారెడ్డి, రాంరెడ్డి, లింగారెడ్డి, ప్రేమ్‌చంద్, దిలీప్‌కుమార్, శ్రీనివాస్, నాగరాజు, జలేందర్, ప్రశాంత్, గణేశ్ డీలర్లు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన సన్నబియ్యాన్ని రాచర్లబొప్పాపూర్‌లో తహసీల్దార్ సుజాత ప్రారంభించారు. జిల్లా మైనారిటీ అధ్యక్షుడు ఎస్‌కే సాహెబ్, జిల్లా కిసాన్ సెల్ ఉపాధ్యక్షుడు మర్రి శ్రీనివాస్‌రెడ్డి, గ్రామాధ్యక్షుడు గుడ్ల శ్రీనివాస్, చల్ల పద్మారెడ్డి, గోగూరి శ్రీనివాస్‌రెడ్డి, మారుపాక సత్యం, ఏలూరి శ్రీనివాస్, ముద్రకోల సాయిప్రేమ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కొంగరి కిష్టారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రుద్రంగి: సబ్బండ వర్గాల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని రుద్రంగి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చెలుకల తిరుపతి అన్నారు. మండలకేంద్రంలోని రేషన్ దుకాణంలో సన్నబియ్యం పంపిణీ ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ గట్ల మీనయ్య, ఆలయ చైర్మన్ కొమిరె శంకర్, మాజీ సర్పంచ్ తర్రె మనోహర్, బీసీసెల్ అధ్యక్షుడు గండి నారాయణ, గ్రామశాఖ అధ్యక్షుడు సామ మోహన్ రెడ్డి, గండి అశోక్, గడ్డం శ్రీనివాస్, ఇప్ప మహేశ్, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ‘పది’ పరీక్షలు

సిరిసిల్లకల్చరల్: జిల్లాలో పదో తరగతి పరీక్షలు విజయవంతంగా ముగిశాయి. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా ప్రశాంతంగా ముగిసినట్లు జిల్లా విద్యాధికారి జనార్దన్‌రావు తెలిపారు.

సంపూర్ణ ఆరోగ్యానికి యోగా



శిక్షణలో పాల్గొన్న సిబ్బంది

ముస్తాబాద్: సంపూర్ణ ఆరోగ్యానికి యోగా దోహదపడుతుందని జిల్లా ఆయుష్ ఇన్‌చార్జి డాక్టర్ శశిప్రభ అన్నారు. ముస్తాబాద్ ఆయుష్ కేంద్రంలో జిల్లాలోని సిబ్బందికి గురువారం శిక్షణ తరగతులు నిర్వహించారు. ఆయుష్ కేంద్రాలకు వచ్చే రోగులకు మందులతోపాటు యోగాపై అవగాహన కల్పించాలన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆయుష్ డీపీఎం తిరుపతి, యోగా శిక్షకుడు కృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్య



సుజాత (ఫైల్)

వేములవాడఅర్బన్: వేములవాడ మండలం ఆరెపల్లి గ్రామానికి చెందిన సిలువేరి సుజాత (45) కొన్ని నెలలుగా అనారోగ్యంతో బాధపడుతోంది. గురువారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుంది. మృతురాలికి కొడుకు, కుమార్తె ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వేములవాడ టౌన్ సీఐ వీరప్రసాద్ తెలిపారు.

గుండెపోటుతో మరొకరు..

ఎల్లారెడ్డిపేట: మండలంలోని కిషన్‌దాస్‌పేటకు చెందిన కందుకూరి శోభ (49) గుండెపోటుతో గురువారం మృతిచెందింది. రెండ్రోజులక్రితం శోభ తీవ్ర అస్వస్థతకు గురికాగా, ప్రైవేటు ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. చికిత్స అందిస్తుండగానే శోభ గుండెపోటుతో మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

ఎల్లారెడ్డిపేట: రాచర్లతిమ్మాపూర్ శివారులో అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను గురువారం రాత్రి పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై రమాకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. స్టేషన్ హౌస్ అధికారి నారాయణ సిబ్బందితో కలిసి తిమ్మాపూర్ వద్ద వాహన తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఇసుక ట్రాక్టర్ పట్టుకోగా ఎలాంటి అనుమతి పత్రాలు లేకపోవడంతో పోలీస్‌స్టేషన్‌కు తరలించి, వాహన యా జమాని, తిమ్మాపూర్‌కు చెందిన డ్రైవర్ కట్ల తిరుపతిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు. ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేశారు.

అడవిపందుల దాడిలో పంట ధ్వంసం

కోనరావుపేట: మండలంలోని ధర్మారంలో అడవిపందుల దాడిలో పంట ధ్వంసమైంది. గ్రామానికి చెందిన మల్యాల సుమన్ తనకున్న రెండెకరాల్లో వరిపంట సాగు చేస్తున్నాడు. కొద్ది రోజుల్లో కోసేందుకు సిద్ధమవుతుండగా అడవిపందులు పంట ధ్వంసం చేశాయి. బాధిత రైతును ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సంక్షిప్త వార్తలు

• విద్యార్థులకు వైద్య పరీక్షలు

ఎల్లారెడ్డిపేట: మండలంలోని రాచర్ల గొల్లపల్లి బీసీ హాస్టల్‌లో ఉండి చదువుతున్న విద్యార్థులకు గురువారం మండల వైద్యాధికారి సరియా అంజుమ్ ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించి వైద్య పరీక్షలు చేశారు. 30 మందికి వివిధ పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఏఎన్ఎం రాజేశ్వరి, ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

• రిటైర్డ్ జవాన్‌కు సన్మానం

ఎల్లారెడ్డిపేట: రిటైర్డ్ జవాన్ పంతంగి రవిని బీజేపీ మండలశాఖ ఆధ్వర్యంలో గురువారం సన్మానించారు. పార్టీ మండల శాఖ అధ్యక్షుడు పొన్నాల తిరుపతిరెడ్డి మాట్లాడుతూ ఇరువై ఏళ్లపాటు ఆర్మీలో సేవలందించిన ఉద్యోగ విరమణ పొందిన రవిని యువత ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. నాయకులు చందుపట్ల లక్ష్మారెడ్డి, మంతుర్తి శ్రీనివాస్, ఉడుగుల యాదగిరి, బొమ్మడి స్వామి, వంగల రాజు, నంది నరేశ్, దాసరి గణేశ్, కృష్ణహరి, మానుక కుమార్, మధుసాగర్, దేవయ్య పాల్గొన్నారు.

• హెచ్‌సీయూ భూముల అమ్మకాలు ఆపాలి

రుద్రంగి: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూముల పరిరక్షణకు పోరాటం చేస్తున్న రుద్రంగికి చెందిన ఎర్రం నవీన్ అనే విద్యార్థిపై పోలీసులు అక్రమ కేసు పెట్టి జైలుకు పంపగా సీపీఎం నాయకులు కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...కార్పొరేట్ కంపెనీల కోసం యూనివర్సిటీ భూములను విక్రయానికి పెట్టారన్నారు. సెంట్రల్ యూనివర్సిటీ భూముల విక్రయాన్ని ఆపి విద్యార్థులపై పెట్టిన కేసులను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇక్కడ సీపీఎం జిల్లా కార్యదర్శి మూశం రమేశ్, జగిత్యాల జిల్లా కమిటీ సభ్యుడు తిరుపతి నాయక్ ఉన్నారు.

• అనారోగ్యంతో తెలంగాణ ఉద్యమకారుడి మృతి

ఎల్లారెడ్డిపేట: తెలంగాణ మలిదశ ఉద్యమంలో చురుకుగా పాల్గొన్న మండలంలోని బొప్పాపూర్‌కు చెందిన పేయింటర్ గడ్డి నర్సయ్య అనారోగ్యంతో మృతిచెందాడు. మంగళవారం హఠాత్తుగా అనారోగ్యానికి గురైన నర్సయ్యను కుటుంబ సభ్యులు ఎల్లారెడ్డిపేటలోని ప్రైవేట్ హాస్పిటల్లో చేర్పించారు. చికిత్సపొందుతూ గురువారం మృతిచెందాడు.

బీజేపీ నేతల వ్యాఖ్యలు హాస్యాస్పదం



మాట్లాడుతున్న సంగీతం శ్రీనివాస్

సిరిసిల్లటౌన్: నిరుపేదలకు సన్నబియ్యం పంపిణీపై బీజేపీ నేతల వ్యాఖ్యలు హాస్యాస్పదమని టీపీసీసీ కోఆర్డినేటర్ సంగీతం శ్రీనివాస్ విమర్శించారు. గురువారం పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సిరిసిల్ల పర్యటనకు వచ్చిన మంత్రి పొన్నంపై బీజేపీ నేతలు అసత్యారోపణలు చేశారన్నారు. బీజేపీ పాలిత ప్రాంతాలతో పాటు ఇతర ఏ రాష్ట్రంలోనూ రేషన్ ద్వారా సన్నబియ్యం పంపిణీ ఇవ్వడం లేదన్నారు. కరీంనగర్ ఎంపీగా, కేంద్ర మంత్రి బండి సంజయ్ నియోజకవర్గం అభివృద్ధికి నిధులేమి తీసుకురాలేదన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల అసత్యప్రచారాలు ప్రజలు నమ్మవద్దన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్‌పై ఇష్టానుసారంగా మాట్లాడితే సహించబోమన్నారు. సమావేశంలో ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, ఏఎంసీ చైర్మన్ వెల్ముల స్వరూపరెడ్డి, కాముని వనిత, సూర దేవరాజు, అశోక్, భాను తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను తప్పుదోవ పట్టించొద్దు



మాట్లాడుతున్న రవితేజగౌడ్

సిరిసిల్లటౌన్: స్వార్థ రాజకీయాల కోసం బీఆర్ఎస్, బీజేపీ హెచ్‌సీయూ విద్యార్థులను తప్పుదోవ పట్టిస్తున్నాయని కాంగ్రెస్ పార్టీ లీగల్‌సెల్ కన్వీనర్ బుర్ర రవితేజగౌడ్ ఆరోపించారు. గురువారం పట్టణ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఓయూ భూములను లాక్కునే ప్రయత్నం చేసి విఫలమైందన్నారు. ప్రజా ప్రభుత్వం పర్యావరణ పరిరక్షణకు కట్టుబడి ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా లీగల్ సెల్ చైర్మన్ ఇరుకుల అశ్విన్, స్పోక్స్ పర్సన్ భగవాన్, రాజేశ్, జాయింట్ కన్వీనర్ తిరుపతి, సుహాసిని, జ్యోతి, రాకేశ్, కమలాకర్, విశాల్ తదితరలు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు వినతి



తహసీల్దార్ ముక్తార్‌పాషాకు వినతిపత్రం ఇస్తున్న బీసీ మండల నాయకులు

వీర్నపల్లి: మండలకేంద్రంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు మల్లేశం ఆధ్వర్యంలో మండలస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు మేకల పరశురాం మాట్లాడుతూ..భూమిలేని పేదలు, కౌలుదారులు, ఉపాధిహామీ కూలీలను గుర్తించి వారికి సంక్షేమ పథకాలు అందించాలని ఇన్‌చార్జి తహసీల్దార్ ముక్తార్ పాషాకు ఇన్‌చార్జి ఎంపీడీవో అబ్దుల్ వాజిద్ వినతిపత్రం అందించారు. బీసీ సంఘం మండల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

అగ్రనేతలతో ‘ఆది’



వేములవాడ: బీసీలకు రాజకీయ, విద్యా, ఉద్యోగాల్లో 42 శాతం రిజర్వేషన్లు పెంచుతూ రాష్ట్ర శాసనసభలో చట్టం చేయడంపై ఢిల్లీలో సోనియాగాంధీ, రాహుల్‌గాంధీని మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, బీసీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలతో ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్ గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ధన్యావాదాలు తెలిపారు.

పనిదినాలు, వేతనాలు పెంచాలి

బోయినపల్లి: జాతీయ ఉపాధిహామీ పథకంలో పనిదినాలు, వేతనాలు పెంచకపోవడంతో చాలా మంది పనులు లేక ఇబ్బందులు పడుతున్నారని సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు, జిల్లా కార్యవర్గ సభ్యుడు మీసం లక్ష్మణ్ పేర్కొన్నారు. మండలంలోని వెంకట్రావుపల్లిలో గురువారం సీపీఐ గ్రామ శాఖ మహాసభ నిర్వహించారు. కార్మికులకు రోజుకు రూ.800 వేతనం, ఏడాదికి 200 పనిదినాలు కల్పించాలని కోరారు. బాలయ్య, మల్లేశం, రాజయ్య, తదితరులు పాల్గొన్నారు.

విప్లవ యోధుడు దొడ్డి కొమురయ్య



ముస్తాబాద్‌లో కొమురయ్య విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న గొల్లకురుమ సంఘం నాయకులు

ముస్తాబాద్: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో గడీల పాలనను ఎదురించిన విప్లవ యోధుడు దొడ్డి కొమురయ్య అని యాదవ సంఘం జిల్లా అధ్యక్షుడు మిరాల భాస్కర్‌యాదవ్ పేర్కొన్నారు. ముస్తాబాద్‌లో యాదవ కురుమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దొడ్డి కొమురయ్య విగ్రహాన్ని గురువారం ఆవిష్కరించారు. కొమురయ్య స్ఫూర్తిని భవిష్యత్ తరాలకు అందించాలన్నారు. యాదవ కురుమ సంఘం అధ్యక్షుడు రాగం నాగరాజు, ఏఎంసీ చైర్‌పర్సన్ తలారి రాణి, సెస్ డైరెక్టర్ అంజిరెడ్డి, సంఘం బాధ్యులు మల్లేశ్ యాదవ్, కొమురయ్య, నవీన్, బాలెల్లు, కోడె శ్రీను, యాదగిరి, ఎల్లం, కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు యెల్ల బాల్‌రెడ్డి, అంజాగౌడ్, సురేందర్‌రావు, కాంగ్రెస్ పార్లమెంట్ కో కన్వీనర్ చక్రధర్‌రెడ్డి, సంతోష్‌రావు, కొమ్ము బాలయ్య పాల్గొన్నారు.

దాడి సంఘటనలో ఇద్దరిపై కేసు

ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల బొప్పాపూర్‌కు చెందిన మహమ్మద్ సమ్మద్ అనే చికెన్ సెంటర్ నిర్వాహకుడిపై దాడి చేసిన అదే గ్రామానికి చెందిన ఇద్దరిపై పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. ఎస్సై రమాకాంత్ తెలిపిన వివరాలు. సమ్మద్ చికెన్ సెంటర్ నడుపుకుంటూ జీవిస్తున్నాడు. గురువారం ఉదయం చికెన్ కోసం ల్యాగల శ్రీను వచ్చాడు. శ్రీనుతో సమ్మద్ మాట్లాడుతుండగా.. తమ గురించే మాట్లాడుతున్నారనే అనుమానంతో పక్కనే ఉన్న మరో చికెన్ సెంటర్ నిర్వాహకులు మహమ్మద్ మెహబూబ్ అతని కుమారుడు మహమ్మద్ అల్తార్‌లు సమ్మద్‌పై దాడి చేశారు. అడ్డు వచ్చిన సమ్మద్ సోదరుడు మహమ్మద్ వసీంపై కూడా దాడి చేశారు. ఈ సంఘటనపై బాధితుడి ఫిర్యాదుతో మెహబూబ్, అల్తార్‌లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పరిసరాల శుభ్రత అందరి బాధ్యత

ఎల్లారెడ్డిపేట: మండలంలోని బాకూరుపల్లిలో తెలంగాణ సాంస్కృతిక సారథి కళాబృందం ఆధ్వర్యంలో గురువారం ప్రకృతిపై అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ కవర్లను వాడొద్దన్నారు. పరిసరాల శుభ్రత అందరి బాధ్యత అని ఆట పాటల ద్వారా వివరించారు.



బోయినపల్లి: విలాసాగర్‌లో కొమురయ్య విగ్రహానికి పూలమాల వేస్తున్న కనుకయ్య



ఇల్లంతకుంటలో..

దొడ్డి కొమురయ్యకు నివాళి

తెలంగాణ సాయుధ పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య జీవితం ఆదర్శనీయమని పలువురు పేర్కొన్నారు. గురువారం సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గాల్లో ఆయన జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలవేసి నివాళి అర్పించారు. ఆయా కార్యక్రమాల్లో నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

– బోయినపల్లి/ఎల్లారెడ్డిపేట/ఇల్లంతకుంట/తంగళ్లపల్లి

సన్మానం

ఎల్లారెడ్డిపేట: మండలంలోని రాచర్ల బొప్పాపూర్ జెడ్పీ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థి పల్లె దినేశ్ అగ్నివీర్‌కు ఎంపిక కాగా ఉపాధ్యాయులు, విద్యార్థులు గురువారం సన్మానించారు. దినేశ్ స్ఫూర్తితో విద్యార్థులు దేశ రక్షణలో పాలు పంచుకోవాలన్నారు.